www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 అక్టోబర్ 2025

5

కాకినాడ

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల యొక్క స్థితి తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

2027 నాటికి పోలవరం పూర్తి

-చంద్రబాబు పాలనలో రైతు సంక్షేమం
-ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేసిన వైసిపి
-మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

సభలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - జగ్గంపేట

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం జగ్గంపేట మండలం మామిడాడ శివారున ఉన్న పురుషోత్తమపట్నం పంపు హౌస్ ట్యాంక్ వద్ద ఐదు గ్రామాలకు నీరు అందించే రూ.3.49 కోట్లతో చేపట్టే సాగునీటి పథకానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు అన్నింటినీ నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. మళ్ళీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టు అన్నింటిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాయలసీమ ప్రాంతానికి సైతం జగన్ గత ప్రభుత్వంలో నీరు ఇవ్వలేదన్నారు. చంద్రబాబు వచ్చాక రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రారంభించి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు రూ.54 కోట్లతో క్యాబినెట్లో ఆమోదం పొందడం జరిగిందని ఆయన తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. తాళ్లూరు లిఫ్ట్ బాగు చేసి 30 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. డామేజ్ అయిన కాలవలు మరమ్మతులకు రూ.ఐదు కోట్లతో ఆపరేషన్ మేనేజ్మెంట్ కింద మంజూరు చేసి టెండర్లు పిలిచి డ్యామేజ్ అయిన పనులను పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ శాఖకు రూ.18 వేల కోట్లు బకాయిలు పెట్టడం జరిగిందని, వాటిని చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1040 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉంటే అందులో 240 లిఫ్ట్ ఇరిగేషన్లు మాత్రమే పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌లు మరమ్మతులు చేయడానికి రూ.840 కోట్లు అవసరం అవుతుందని ఆయన తెలిపారు. వీటన్నింటిని బాగు చేసేందుకు టెండర్లు పిలవడంతో పాటు 10 సంవత్సరాల పాటు ప్రభుత్వమే ఈ లిఫ్టులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. రూ.350 కోట్ల రూపాయలతో శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తెలిపారు. ధవలేశ్వరం బ్యారేజ్ గేట్లు ప్రమాద స్థాయిలో ఉన్నాయని, వీటిని మరమ్మతులు చేసేందుకు రూ.250 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను నాశనం చేసిందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి రాయలసీమలో అన్ని జలాశయాలు జల కళ తో ఉన్నాయని ఆయన అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.350 కోట్లతో పనులు చేపట్టడం ఆయన తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు రూ.1200 కోట్లతో చేపట్టడం జరిగిందని వివరించారు. పోలవరం ప్రాజెక్ట్ 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పట్టించుకోలేదని వాటన్నింటిని సరిదిద్దే ముందుకు వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదే తరహాలో జగ్గంపేట నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని నిరంతరం పరితపించే నాయకుడు జ్యోతుల అన్నారు. ఈ ప్రాంత రైతుల కోసం నెహ్రూ సాగునీటి పథకాన్ని మంజూరు చేయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రూ.3.49 కోట్లతో జ్యోతుల పాపారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరీ చేసిందని తెలిపారు. దీని ద్వారా 3500 ఎకరాలు శివారు భూములకు నీరు అందించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఇదే కాకుండా తాళ్లూరి లిఫ్ట్ ఇరిగేషన్ కూడా రూ.54 కోట్లతో మంజూరి చేయడం జరిగిందని వివరించారు. గతంలో ఈ ప్రాంతానికి నాలుగు పథకాలు తెచ్చుకుంటే ఇది ఐదవ పథకం అని, దీని ద్వారా జగ్గంపేట నియోజకవర్గం లోని శివారు భూములకు నీరు చేరుతుందని అన్నారు. తద్వారా రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం కు ఈ ప్రభుత్వం లో ప్రత్యేక ప్రాధాన్యత లభించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఇరిగేషన్ శాఖ సిఇ కె. నరసింహమూర్తి, ఎస్ఇ డి.ఏసుబాబు, ఇఇ డి.శ్రీనివాసులు, డిఇ వి.ప్రసాద్‌రావు, జగ్గంపేట జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్‌బాబు, పుష్కర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అడబాల భాస్కరరావు, సూరంపాలెం ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ ఉంగరాల రాము, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, నాయకులు ఎస్‌వివిఎస్.అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, మండల పార్టీ అధ్యక్షులు జీనుమణి బాబు, ఎంపిపి తోట రవి, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల, ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్

పెదమల్లాపురం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

పెద్దమల్లాపురం కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రాఘవపట్నంలో ఉన్న ఆశ్రమ పాఠశాల ఆవరణలో అఖిల భారత ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కోటనందూరు మండలాల్లో ఉన్న గిరిజన గ్రామాలను ప్రభుత్వం నాన్ నోట్ ఫైడ్ గిరిజన గ్రామాలుగా ఉంచిందన్నారు. వీటిని నోట్‌ఫైడ్ గ్రామాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే పెద్దమల్లాపురం మండల కేంద్రంగా ఏర్పాటు చేసి ఆయా గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని రాఘవపట్నంలో ఉన్న ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆదివాసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటిమల సత్తిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వరహాలు, అయితా రామకృష్ణ, వై.ఎల్లయ్య, పిండిపంటలు ధర్మరాజు, చెన్నాడ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అయన అధికారులతో కలిసి మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి స్థానిక క్రీడాకారులకు అత్యాధునిక సౌకర్యాలు అందించే దిశగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. మైదానాన్ని అన్ని హంగులతో క్రికెట్, వాలీబాల్, ఖో ఖో తదితర క్రీడాలకు అనువుగా తీర్చి దిద్దడంతో పాటు, మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు చేపడతమన్నారు. క్రీడా మైదానం అభివృద్ధికి సంబంధించి త్వరితగతిన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పాడా ఎపిడి వసంత మాధవి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక క్రీడాకారులతో కలిసి కొంత సమయం క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు.

అధికారులతో చర్చిస్తున్న ఎంపి ఉదయ్‌శ్రీనివాస్

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని 2, 3, 4 వార్డుల్లో నెలకున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కార పోరాట కమిటీ, ప్రజాసంఘాల నాయకులు ఆయా వార్డుల్లో పర్యటించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్, వార్డుల్లోని మురికి కాలువలను, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం, సిపిఎం మండల కన్వీనర్ కుంచె చిన్న మాట్లాడుతూ స్థానిక 3వ వార్డులో ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం, భాష్యం స్కూల్‌కి వెళ్లే దారి చిన్నపాటి వర్షానికి ముంపుకు గురవుతుదన్నారు. వర్షపు నీరు చెరువులను తలపిస్తుందని విమర్శించారు. 2, 3, 4 వార్డులలో మురుగనీరు వెళ్లేందుకు ప్రధాన కాలువను వజ్రాల కాలువ వరకు నిర్మాణం చేపట్టాలని కోరారు. పారిశుధ్య

డ్రెయినేజీని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. అనేకసార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అయినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో 2, 3, 4 సమస్యల పరిష్కార కమిటీ సభ్యులు బి.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ, జి.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీరామ్మూర్తి, ఎస్.రామ్మోహన్‌రావు, ఆర్.కోటారావు, ఆర్ అప్పారావు, ఆర్.అరవింద్, ప్రజాసంఘాల నాయకులు డి.గోపాలకృష్ణ, జి.వీరబాబు, కె.నాగేశ్వరరావు, సూర్యనారాయణ, వి.స్టాలిన్ పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్ల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రయివేట్ ఆర్ఓ ప్లాంట్ల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ తాగునీటి విభాగం ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్‌రావు సూచించారు. ఆదివారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలు, డిప్యూటీ ఎంపిడిఒల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే తాగునీటి నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలు ప్రభుత్వ నీటినే వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆర్ఓ ప్లాంట్ల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు రుచిగా ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. ఇటువంటి కేంద్రాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు భద్రతా ప్రమాణాలతో కూడిన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎంపిడిఒలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. నీటిని సంరక్షించకపోతే భవిష్యత్తులో తాగునీటి

శిక్షణలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ప్రభాకరరావు

సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తాగు నీటి సరఫరా కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.10 వేల కోట్లకు పైగా వ్యయం చేస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ అధికారులు తాగునీటి సరఫరాను ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఇలు ఉమాశంకర్, శ్రీనివాస్, సురేష్, పెద్దాపురం డిఇఇ స్వామి, ఎఇఇ శ్రీరామ్, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డును పునర్నిర్మాణం చేయాలి'

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని జగన్నాధపురం వంతెన నుంచి అమ్మమ్మ గాటి సెంటర్ వరకు ఉన్న రహదారిని తక్షణమే పున్ననిర్మాణం చేపట్టాలని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమలాపురం, యానం, రావులపాలెం, రామచంద్రపురం, ద్రాక్షారామ రహదారుల మీదుగా వచ్చే వాహనాలన్నీ జగన్నాధపురం రెండవ వంతెన మీదుగా వస్తాయన్నారు. జగన్నాధపురం వంతెనపై నుంచి అన్నమ్మ గాటి సెంటర్ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. గుంతలు పూడ్చి తదుపరి రోడ్డు పునర్నాణం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఈ రోడ్‌లో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు సైకిల్‌పై వచ్చే విద్యార్థులు ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం సాగిస్తున్నారన్నారు. కావున తక్షణమే జగన్నాధపురం వంతెన నుంచి అమ్మమ్మగాటి సెంటర్ వరకు రహదారిని పునర్నిర్మాణం చేపట్టి ప్రమాదాలు నివారించాలన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా సాయిప్రసాద్

ప్రజాశక్తి - పెద్దాపురం

సాయిప్రసాద్

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా పెద్దాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యేందుకు కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సాయి ప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

జిఎస్‌టి తగ్గింపుపై ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పి. వేమవరం గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో జిఎస్‌టి తగ్గింపుపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి యువ నాయకుడు రంగనాగ్ పాల్గొని ఇంటింటా జిఎస్‌టి తగ్గింపుపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తోట నాగభూషణం, పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వేస్టేషన్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు టిడిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వివాహ వేడుకలో పాల్గొనేందుకు ఆదివారం ఆయన సామర్లకోటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ ఎం.రమేశ్, టిడిపి నేతలు అడబాల కుమారస్వామి, కంటే జగదీశ్‌మోహన్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, మలిరెడ్డి దుర్గాప్రసాద్, వల్లూరి గాంధీ, గుడాల శంకర్, ఎండి సైపుల్ల, పడాల వీరబాబు,


మంత్రికి స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మట్టే శ్రీనివాస్ కుటుంబంలో జరిగిన వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు.

దేవాలయాల్లో కళాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - శంఖవరం

దేవాలయాల్లో తమ వృత్తి నైపుణ్యాలతో ప్రదర్శనలు ఇస్తున్న వివిధ కళాకారులను ప్రోత్సాహించాలని అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ అన్నారు. ఆదివారం కొండపైన రామరాయణం కళామందిర్‌లో అక్షయ సోషల్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలపై జీవిస్తున్న కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కళే జీవనాధారంగా బతుకుతున్న అనేక మంది కళాకారులు నేటి పరిస్థితుల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అటువంటి కళాకారులను


దేవస్థానం ఛైర్మన్ రోహిత్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులను, నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్ఒ కృష్ణారావు, కళాకారులు పాల్గొన్నారు.

వికలాంగ పింఛను ఇప్పించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వికలాంగుడు

స్థానిక ఎస్సి పేటకు చెందిన పలివెల శ్యామ్‌కుమార్ చిన్నప్పుడే రెండు కాళ్లు, ఒక చెయ్యి పోలియోతో పని చేయడం లేదు. చిన్నప్పుడే తల్లితండ్రులు కోల్పోయాడు. నాటి నుంచి అమ్మమ్మ, తాతయ్యల సంరక్షణలో బతుకు తున్నాడు. రెండు కాళ్లు, చెయ్యి పని చేయకపోయినా తన మనవుడు శ్యామ్‌కుమార్‌కు వికలాంగ పింఛన్ మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిడ్డ ధీనస్థితిని చూసైనా అధికారులు వికలాంగ పింఛన్‌ను మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కల్తీ మద్యం, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు పందిరిపల్లి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చి కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ కుటీర పరిశ్రమలా మార్చిందని విమర్శించారు.

పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం స్థానిక వివేకానంద పార్కులోని గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో 'సండే స్టోరీ టైమ్ - చదవటం మా కిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుటకు 140 వారాలుగా ప్రతి ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆహార అలవాట్లు ఆరోగ్యానికి కీలకం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రోజువారీ ఆహారపు అలవాట్లలోని లోపాల వల్లనే యువతలో గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని ప్రముఖ శస్త్ర చికిత్స వైద్యులు డాక్టర్ శిరిగినీడి వీరభద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతలో అసహజమైన ఆహారపు అలవాట్ల కారణంగా గుండెపోటుతో అకాల మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఏం తింటున్నామనే దానికంటే, ఎంత పోషకాలు తీసుకుంటున్నామనే అంశమే ముఖ్యమన్నారు. కల్తీ ఆహార పదార్థాల వినియోగం కారణంగా క్యాన్సర్, గ్యాస్ట్రిక్, మూలశంక (పైల్స్) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యల నివారణకు ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం అత్యవసరం అని సూచించారు.

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వీరభద్రరావు

ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు ఆహారంలో పండ్లు, ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని, వాటితో పాటు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. మన ఆహారపు అలవాట్ల పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, సూర్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, శ్రీవాణి, కుమార్ యాదవ్, రేలింగి బాపిరాజు పాల్గొన్నారు.


ఇఒ సుబ్బారావుకు ఫిర్యాదు చేస్తున్న పెళ్లికొడుకు

దళారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి రత్నగిరి కొండపై కొంతమంది దళారులు యాత్రికులు, పెళ్లి బృందాలను మోసం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఒక పెళ్లి బృందం దేవస్థానం ఇఒ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి కైకలూరుకి చెందిన జానకి నాయకి పెళ్లి బృందం అశోక్, హరి అనే దళారులు తమ దగ్గర ఎసి ఉచిత కళ్యాణ మండపం అని చెప్పి రూ.25 వేలు తీసుకుని, నాన్ ఎసి కల్యాణ మండపంలో పెళ్లి చేసుకోమన్నారని తెలిపారు. దాని గురించి అడిగితే తమపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ఫిర్యాదుపై స్పందించిన ఇఒ ఎఇఒ స్థాయి అధికారిని విచారణకు ఆదేశించారు అయితే రత్నగిరిపై తరచూ జరుగుతున్న అయితే ఉద్యోగుల్లో కొంతమంది దళారీలతో కుమ్మక్కు అవడం వలనే ఇటువంటి సంఘటనలు పునరావతం అవుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

తల్లిని బెదిరించిన కుమారులపై కేసు నమోదు

ప్రజాశక్తి – ఆత్రేయపురం

నువ్వు ఉంటున్న ఇంటిని మాకు ఇచ్చేయాలంటూ కన్నతల్లిని ఇంట్లో నుంచి బయటికి నెట్టేసి చంపేస్తామంటూ బెదిరించిన కుమారులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం.. మండలంలోని కట్టుంగ గ్రామానికి చెందిన నెకూరి వరలక్ష్మికి కృపావరం, కుమార్ రాజా ఇద్దరు కుమారులు. వరలక్ష్మి భర్త మరణించి సుమారు పదేళ్ల అవుతోంది. ఆమె తన రెండుపోర్షన్ల పెంకుటింట్లో నివసిస్తోంది. కుమారుల ఇద్దరికీ వివాహమైంది. అయితే తల్లి వరలక్ష్మి ఉంటున్న ఇల్లును మాకు ఇచ్చేయాలంటూ కుమారులు ఇద్దరు తరచూ తల్లిని ఇబ్బంది పెట్టడంతో పాటు బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తల్లి వరలక్ష్మిని ఇంట్లోంచి బయటకు నెట్టేశారు. మళ్లీ ఇంట్లోకి వచ్చావంటే చంపేస్తానంటూ కుమారులు బెదిరించడంతో ఆమె ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

ద్రాక్షారామంలో బాణసంచా మందు స్వాధీనం

ప్రజాశక్తి – రామచంద్రపురం

ద్రాక్షారామ గ్రామం లోని చంద్రావీది లో ఎటువంటి అనుమతి లేకుండా నిలువ వుంచిన మతాబు మందు అమ్ముతున్న చెరకు కోటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి 125 కేజీలు మందును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటుగా సమయమంతుల రాంబాబు కిరాణా షాప్ వద్ద నుండి 22 కేజీల మతాబు మందును సీజ్ చేశారు. వారి ఇరువురిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దీపావళి సామగ్రిగాని, పేలుడు పదార్థాలు గాని అక్రమంగా ఎటువంటి అను మతి లేకుండా నిల్వ ఉంచినా, తయారు చేసినా, విక్రయించిర వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ద్రాక్షారం ఎస్ఐ ఎం.లక్ష్మణ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి – యానాం

యానాంలో శనివారం రాత్రి జరిగిన హత్యకు కారకుడైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ అడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు హత్య సంఘటనకు సంబంధించిన వివరాలను వివరించారు. 2022 మార్చి 12న మోకా వెంకటేశ్వరరావు గోపాల్ నగర్, మోకాగార్డెన్స్‌లో తన ఇంటి వద్దే హత్యకు గురయ్యాడు. ఆ కేసులో ప్రధాన నిందితుడిగా శనివారం రాత్రి హత్యకు గురైన తిపురశెట్టి నారాయణసామి (34)ని మోకా వెంకటేశ్వరరావు కుమారుడు ఆనంద్ పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు తెలిపారు. తన నాన్నని చంపిన విధంగానే చంపాలని నిందితుడు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. .నారాయణసామి కొన్నేళ్ల పాటు పుదుచ్చేరి కాలాపేట జైలులో శిక్ష అనుభవిస్తున్న అతను ఇటీవలి బెయిల్‌పై బయటకు వచ్చాడని తెలిపారు. యానాం స్టేషన్లో ప్రతిరోజు వచ్చి సంతకం పెడుతున్నాడని తెలిపారు. ఈ నేపత్యంలో వెంకటేశ్వరరావు హత్యకు ప్రతీకారంగా ఈ హత్య జరిగిందన్నారు. మల్లవరం సమీపంలో హత్య చేసిన నిందితున్ని అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. నిందితునికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులను సిఐ అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి – యానాం

స్థానిక న్యూ బస్టాండ్ సమీపంలో ఓపెన్ ఆడిటోరియం వద్ద గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం ఆదివారం లభించిందని ఎస్ఐ పునీత్‌రాజ్ తెలిపారు. ఆ వృద్ధుడు భిక్షాటన చేస్తాడని, సుమారు 70 సంవత్సరాల వయసు ఉండి, 7 అడుగుల ఎత్తు ఉంటాడన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు యానాం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు

ప్రజాశక్తి – గొల్లప్రోలు

యువతి కిడ్నాప్ ఉదంతంపై నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఒక యువతి తుని మండలానికి చెందిన కర్రి వంశీ, అహ్మద్ అల్తాఫ్‌లతో ప్రేమ వ్యవహారం నడుపుతోంది. శనివారం ఉదయం 10 గంటలకు మహమ్మద్ అల్తాఫ్ యువతి ఇంటికి వెళ్లి మాట్లాడాలని పిలిచాడు. దీంతో ఆమెను స్కూటర్‌పై ఎక్కించుకుని అనకాపల్లి సమీపంలోని రాజానగరం బీచ్‌కు తీసుకువెళ్లాడు. మరో ప్రేమికుడు కర్రి వంశీని కలుసుకున్నారు. వారిద్దరూ కలిసి ఆమెను వేరోక కారులో బలవంతంగా ఎక్కించుకుని వీరిద్దరికి స్నేహితుడు తునికి చెందిన రాజును కారులో ఎక్కించుకుని ఎవరో ఒకరిని ప్రేమించాలని ఆమెను చేతులతో కొట్టుతూ చుట్టుపక్కల ప్రాంతాలు తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా గొల్లప్రోలు చేరుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన సాంబ అనే వారి స్నేహితుడిని కలుసుకుని చేబ్రోలు హైవే పక్కన ఉన్న రోడ్లోకి తీసుకువెళ్లి ఆమెను బెదిరించారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకుని యువతితోపాటు, నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. జరిగిన సంఘటనపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై కిడ్నాపు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి – మామిడికుదురు

స్థానిక హైస్కూల్లో నిర్వహించే ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని హైస్కూల్ హెచ్ఎం కో-ఆర్డినేటర్ బొండాడ చిరంజీవి సూచించారు హైస్కూల్లో ఆదివారం నుంచి టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్‌ను ప్రారంభించారు. 14 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఓపెన్ స్కూల్లో చదువుకునే అవకాశం ఉందన్నారు పదవ తరగతిలో 12 మంది, ఇంటర్లో 18 మంది ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైనారన్నారు ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ భయ్యా మనోహర్ రాజు, టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తితో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో అందరికీ ఇళ్లు పథకంలో చేపట్టిన గృహాల పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ అన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలతో అర్హులైన వారందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రూ. రూ.1.80 లక్షల యూనిట్ వ్యయంతో పిఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంత అర్హత గల పేదలకు ఈ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఉపాధి హామీ చట్టం నిధులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఇళ్లకు రెండింటిలోనూ 90 రోజుల పని దినాలు వేతనం వినియోగించడం జరుగుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రూ.35 వేలు స్వయం సహాయక నిధుల నుంచి ఇంటి నిర్మాణం కోసం కేటాయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు తదితర అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

అర్బన్ బిఎస్‌సి 1.0 పథకం ప్రగతి ఎలా ఉంది.?

పిఎం ఆవాస్ యోజన అర్బన్ బిఎల్‌సి 1.0 పథకంలో కేంద్రం రూ.1.50 లక్షలు, ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.30 వేలు కలిపి మొత్తం రూ.1.80 లక్షలు సాయం అందిస్తుంది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో గత నెల 24 నాటికి మంజూరైన 81325 ఇళ్లకు గానూ 58,948 ఇళ్ల నిర్మాణాలను (72.48 శాతం) మొదలు పెట్టారు. ఇందులో బిబిఎల్ స్థాయిలో 13177 ఇళ్లు, బేస్‌మెంట్ స్థాయిలో 11914, రూప్ స్థాయిలో 1290, ఇంటి కప్పు స్థాయిలో 936 నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు 31,631 ఇళ్ల పూర్తి అయ్యాయి. 22,377 నిర్మాణాలు వివిధ కారణాలతో ఇంకా మొదలు కాలేదు. వీటి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.69,748.64 లక్షల ఖర్చు చేసింది.

పిఎం ఆవాస్ యోజన గ్రామీణ పథకం ప్రగతి?

ఈ పథకంలో జిల్లాలో 3609 ఇళ్ల మంజూరు కాగా 1081 ఇళ్ల మొదలు పెట్టలేదు. మొదలైన వాటిలో బిబిఎల్ స్థాయిలో 1077 ఇళ్ల, బేస్‌మెంట్ స్థాయిలో 206, రూప్ స్థాయిలో 107, ఇంటి కప్పు స్థాయిలో 1138 నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు 31,631 ఇళ్ల పూర్తి అయ్యాయి. 2528 ఇళ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. వీటి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1703.93 లక్షల ఖర్చు చేసింది.



పిఎంఎవై అర్బన్ 2.0 పథకంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి.?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో పట్టణ ప్రాంతాలలో డిమాండ్ సర్వేలో ఇప్పటివరకు 3,531 లబ్ధి దారుల వివరాలు నమోదు చేశాము. వీటికి రూ.2.50 లక్షలు గృహ విలువతో 2,415 గృహాలకు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) తయారుచేసి కలెక్టర్ ద్వారా అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించాము. అనంతరం కేంద్ర ప్రభుత్వం 2,226 గృహలను మంజూరు చేయడం జరిగింది. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష మొత్తంగా ఈ ప్రాజెక్టు కోసం రూ.55.65 కోట్లు కేటాయిస్తుంది.

ఏయే పట్టణాల్లో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి.?

గొల్లప్రోలు అర్బన్‌లో 110, కాకినాడ సిటీ 1165, పెద్దాపురం 170, పిఠాపురం 200, సామర్లకోట 178, తుని 131, ఏలేశ్వరం 272 మంజూరయ్యాయి. మొత్తం పట్టణ ప్రాంతాల్లో ఇంకా 189 గృహలు మంజూరు కావాల్సి ఉంది.

సొంత స్థలం ఉంటే రుణాలు ఎప్పటి నుంచి ఇస్తారు.?

పట్టణాభివృద్ధి ప్రాంతాలలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు గృహ మంజూరు కోసం గృహ నిర్మాణ సంస్థ వెబ్‌సైట్‌లో డిమాండ్ సర్వేలో ఇప్పటి వరకు 4,244 లబ్ధిదారుల వివరాలు నమోదు చేశాము. వీటికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష మొత్తంగా రూ.2.50 లక్షలు గృహ విలువతో 1,959 గృహలకు డిపిఆర్ తయారుచేసి కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపాము. పిఎం ఆవాస్ యోజన పథకం గ్రామీణ 2.0 పథకంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 713 గృహలకు పిఎం ఆవాస్ యోజన జన్మన్ పథకం ద్వారా 764 గృహలకు సర్వే పూర్తి చేశాము. మంజూరు కావాల్సి ఉంది.

ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం పురోగతి..?

2016-17 నుంచి 2019-20 సంవత్సరాల మధ్య ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో మంజూరైన వాటిలో ఇప్పటి వరకు 719 మొదలుపెట్టనిగా ఉన్నాయి. అలాగే బిబిఎం స్థాయిలో 1260, బేస్‌మెంట్ స్థాయిలో 1944 మొత్తంగా 3923 గృహలు ప్రస్తుత పిఎంఎవై 2.0 పోర్టల్‌లో డేటా ఎంట్రీ చేయడానికి అనుమతి వచ్చింది.

ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం..?

2025 మార్చి 10న ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 09 ప్రకారం ఎస్‌సి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిజిటి లబ్ధిదారులకు రూ.1 లక్ష అదనపు ఆర్థిక సాయం విడుదల చేయడం జరిగింది. జిల్లాలో 2922 మంది లబ్ధిదారులకు రూ.695.98 లక్షల అందించడం జరుగుతుంది.

ఆలోచింపజేస్తున్న 'మహా ప్రస్థానం' షార్ట్ ఫిల్మ్

ప్రజాశక్తి – సామర్లకోట

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బిడ్డలు పట్టించుకునే పరిస్థితులు లేక వృద్ధాశ్రమాలు వెలిశాయి... రానున్న రోజుల్లో కన్నవారు మరణిస్తే ప్రస్తుత బిజీ సమాజంలో తలకొరివి పెట్టలేని పరిస్థితులు రాకపోవని అనుకోలేమని, దానితో మేరేజ్ ఈవెంట్ల మాదిరిగా మహా ప్రస్థానం ఈవెంట్లు వస్తాయని తెలిపే "మహాప్రస్థానం" షార్ట్ ఫిల్మ్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సృజన సమర్పణలో నేటి సమాజంలో జరుగుతున్న తీరును నేటి యువతకు అర్థమయ్యేలా ఈ షార్ట్ ఫిల్మ్‌ను సామర్లకోటకు చెందిన కళాకారులు చిత్రీకరించారు. దీనికి ప్రొడ్యూసర్లుగా బడుగు సీతారామరాజు (బాబి), కేతినిడి శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ షార్ట్ ఫిల్మ్ చూసిన ప్రతి ఒక్కరు కన్నీటి పర్యంతం అయ్యేలా చేసింది. దీనికి రచన, దర్శకత్వం కేబీ ఆనంద్ చేయగా ఫోటోగ్రఫీ టెక్నికల్ సపోర్ట్ ఎం గణేష్ వ్యవహరించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఎవరూ ఒంటరిగా వదల కూడదని, అలాగే కుటుంబం వ్యామోహంలో పడి చుట్టూఉన్న నలుగురు స్నేహితులను దూరం చేసుకుని వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలి పోవద్దని ఈ 'మహా ప్రస్థానం' షార్ట్ ఫిల్మ్ కన్నులకు కట్టినట్టు చూపించింది.

మహాప్రస్థానం షార్ట్ ఫిలింలో ఒక సన్నివేశం

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి – పిఠాపురం

స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 60 మంది చిన్నారులు ఒకే వేదికపై నాట్యం చేశారు. పద్మశ్రీ దివంగత శోభ నాయుడు వర్ధంతి, నాట్య గురువు వెంపటి చిన్నసత్యం జయంతి సందర్భంగా కూచిపూడి దినోత్సవాన్ని నిర్వహించారు. శృంగేరి శంకర మఠం మహాలక్ష్మి ఆలయం నుంచి చిన్నారులు ఊరేగింపుగా బయలుదేరి స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఒక బృందంగా ఏర్పడి చేసిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. శతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయ నిర్వాహకురాలు కొత్త ప్రవీణ, విశ్వేశ్వరరావు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రముఖ నాట్యాచార్యులు వీరభద్రరావు, భారత్ పబ్లిక్ స్కూల్ అధినేత గట్టి శ్రీకృష్ణదేవరాయ వెంకట్రావు, లక్ష్మీ శాంతి, ఇంద్రగంటి మీనాక్షి, అద్దంకి రామప్రియ, మాధవి, వైలెన్ విధ్వంసులు గణపతి, సంగీత విద్వాంసులు గణేష్, చిన్నారుల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నాట్యం చేస్తున్న చిన్నారులు

ప్రశాంతంగా విలేజ్ అసిస్టెంట్ పరీక్షలు

ప్రజాశక్తి – యానాం

రెవెన్యూ శాఖ-విలేజ్ అసిస్టెంట్, తూనికలు కొలతలు-ఎంటిఎస్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 7 పరీక్ష కేంద్రాలలో 1917 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా, 1284 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 633 మంది పరీక్షకు గైరాజరయ్యారని ఆర్ఎఒ అంకిత్ కుమార్ తెలిపారు.

పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

విరగకాసిన రసాల మామిడి

ప్రజాశక్తి – రామచంద్రపురం

సాధారణంగా మామిడి చెట్లు వేసవిలో కాస్తూ ఉంటాయి. మనకు ప్రతి ఏటా మార్చి నుంచి మే నెల వరకు మామిడిపళ్లు లభిస్తాయి. అయితే పునాసకాయల జూన్, జూలైలో కాస్తుంటాయి. అయితే రసాలు రకం మామిడికాయలు కె.గంగవరం మండలం దంగేరు కోటగుంట రోడ్డులో ఉన్న మామిడి చెట్టుకు విరగకాసాయి. వేసవిలో కాయలు కాయని ఈ చెట్టు ప్రస్తుతం గుట్టలు గుట్టలుగా కాయలు కాసింది. ఇది రైతు ఓబులేని గోవిందరాజుకు సంబంధించిన మామిడి చెట్టు అని పరిసర ప్రాంతాల వాసులు తెలిపారు. గుత్తులుగా కాయలు కాసి ఈ మామిడి చెట్టు దారిన వెళ్లే చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

రసాల రకం మామిడి చెట్టు ఇదే

ఘనంగా సాయి ప్రతాప్ రిసెప్షన్

ప్రజాశక్తి- గోపాలపురం

భీమోలు పంచాయతీ సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి కుమారుడు సాయి ప్రతాప్ రిసెప్షన్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకులకు మాజీ హోమ్ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసి కాకులపాటి, సొసైటీ అధ్యక్షుడు వడ్డమూడి రమేష్, వైసిపి మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామ్మోహన్ రెడ్డి, బండారు దొరబాబు, దాకవరపు అప్పారావు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, టిడిపి, వైసిపి, జనసేన, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, రాయితీలు పొందుతూ పరిశ్రమలు స్థాపిస్తున్న వారు ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,ఉందుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ద్వారా భూములు, బ్యాంకు లోన్లు, ఇతర మౌలిక వసతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ద్వారా పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తీసుకు రాకపోవడం వల్ల యువతకు ఉపాధి లేక నిరుద్యోగులు పెరుగుతున్నారని వివరించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో 100కు 75 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎస్‌సిలలో ఉన్న 59 ఒక్క కులాలకు ఉపయోగపడే విధంగా ఎస్‌సి కార్పొరేషన్ నిధులు, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తలారి నాని, కన్నిపాముల శ్రీనివాస్, బొచ్చు చినబాబు, కళ్యాణి జార్జి, కందుల జార్జ్, వెంకట్, దొమ్మలపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించిన కప్పల శ్రీధర్

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి – రావులపాలెం

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలమని జిల్లా వైసిపి అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ పేర్కొ న్నారు. 2025 డిఎస్‌సిలో తమ స్వగ్రామం ఆత్రేయపురం మండల ర్యాలి నుంచి ఎంపికైన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఆదివారం రావులపాలెంలోని తన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సన్మాన సభలో కప్పల శ్రీధర్, వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్య దర్శి పిఎస్ఆర్.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పౌర సమాజం అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయుడిదే కీలక పాత్ర అని, ఒక ఉపాధ్యాయుడు సమాజంలోని అందర్నీ తయారు చేయగలరని అన్నారు. డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ర్యాలి గ్రామం నుంచి గతంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెవి.శేఖర్, ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గూడపాటి మాణిక్యాలరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాళిదాసు గంగాధరం, దిడ్ల విక్రమార్కుడు, గూడపాటి రాజేంద్ర ప్రసాద్, కాకి అర్జున్ రావు, పాలింగి చిట్టిరాజు, దిడ్ల సురేష్, జక్కుల వంశి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై ఉద్యమానికి వైసిపి సన్నద్ధం

ప్రజాశక్తి – రామచంద్రపురం

రాష్ట్రంలో అమలవుతున్న నకిలీ మద్యం విధానాన్ని వ్యతిరేకిస్తూ అదేవిధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ వైసిపి ప్రజా ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. అందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళిక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేశారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ముఖ్య నాయకులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, వైసిపి ప్రజా ప్రతి నిధులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని వైసిపి కార్యాలయానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదివారం సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ అబ్జర్వర్ చింతల పాటి శ్రీనివాస్‌రాజు హాజరుపుతారన్నారు. ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కోటి సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు సూర్య ప్రకాష్ తెలియజేశారు.

పెదపట్నం వెళ్లే మార్గంలో కరకట్టపై బురదలో దిగబడిపోయిన కారు

రహదారి సౌకర్యం లేక అవస్థ

ప్రజాశక్తి – మామిడికుదురు

మామిడికుదురు నుంచి కొర్లకుంట మీదుగా పెదపట్నం శివారు రత్నాపురం వెళ్లే కరకట్టపై మార్గంలో రహదారి సౌకర్యం లేకపోవడంతో దశాబ్దాల తరబడి వర్షాల సమయములో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. శనివారం రాత్రిత స్థానికేతరులు మామిడికుదురు నుంచి కొర్లకుంట మీదుగా పెదపట్నం శివారు రత్నాపురం వెళుతుండగా కరకట్టపై కారు బురదలో దిగబడి పోయింది. రాత్రి సమయము కావడం,ఇక్కడ పరిస్థితులు తెలియకపోవడంతో, స్థానికేతరులు కావడం కారు దిగబడిపోవడంతో చేసేదిలేక అక్కడే విడిచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు ఈ మార్గము మట్టి రోడ్డు స్థానే అర కిలోమీటర్ మేర పక్కా రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని దశాబ్దాల తరబడి స్థానికులు మొరపెట్టుకొనుచున్న సంబంధిత ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి – ముమ్మిడివరం

మండలంలోని లంక ఆఫ్ ఠానేలంక గ్రామంలో గోదావరిలో రైతులు పడవ దిగే క్రమంలో ఒడ్డు విరిగిపడి తటిలో తప్పిన ప్రమాదం తప్పింది. ఆదివారం రైతులు పడవ దిగే క్రమంలో పడవపై ఒడ్డు విరిగి పడింది. ఆ సమయంలో పడవలో ఉన్న పదిమంది రైతులు గోదావరిలో దూకి ప్రాణాలు కాపాడుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. గోదావరి ఒడ్డు సిసి రహదారితో సహా పడవపై కూల డంతో గోదావరిలో పడవ మునిగిపోయింది. పడవ మునగడంతో గోదావరిలోకి దూకిన రైతులు ఈదు కుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. నదీ కోత కారణంగా జరు గుతున్న ప్రమా దాలు, కోత నివారణకు చర్యలు తీసుకోవాలని లంక వాసులు కోరుతున్నారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి – ముమ్మిడివరం

శిథిలావస్థలో ఉన్న జిల్లా ఉప గ్రంథాలయాన్ని ప్రభుత్వ విప్ మరియు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదివారం పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా ఉప గ్రంథాలయాన్ని ఎంఎల్ఎ సుబ్బరాజు ఆకస్మికంగా సందర్శించి గ్రంథాలయంలో ఉన్న సుమారు 20వేల పాత పుస్తకాలను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో లీకైన వర్షపు నేటికీ ఎంతో విలువైన పుస్తకాలు దెబ్బతింటున్నాయని లైబ్రేరియన్ ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందిం చిన ఆయన గ్రంథాలయాన్ని సాధ్యమైనంత త్వరలో ప్రయివేటు బిల్డింగ్‌లో ఉన్న భవనాన్ని పక్కా భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పోలమ్మ చెరువు ప్రాంతంలో స్థలాన్ని కేటాయించి, నూతన గ్రంథాలయం నిర్మాణానికి కషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో విళ్ళ వీరా స్వామి నాయుడు, దాట్ల బాబు, జాగు రాంబాబు, దొమ్మేటి రమణ కుమార్, జాగు సత్తిబాబు, లైబ్రేరియన్ ఎస్ నాగరాజ